క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

పరిగి: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు, మాజీ సర్పంచ్ ఫైమ్‌సుల్తానా అన్నారు. ఆదివారం మండల పరిధి సయ్యాద్‌మల్కాపూర్ గ్రామంలో ఏఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు, మురుగుకాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా.. ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రహీంపటేల్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాసటగా..



మహిపాల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

పరిగి: మిత్రుడు అకాల మరణంతో.. స్నేహితులంతా ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మహిపాల్ గతేడాది మృతి చెందాడు. మృతుడికి భార్య శివాని, కూతురు ఉంది. భర్త మృతి చెందిన నాటి నుంచి శివాని.. ఇబ్రాహింపూర్‌లోని పుట్టినింట్లో ఉంటుంది. ఈ క్రమంలో స్నేహితుడు మహిపాల్ కుటుంబం పేదరికంతో ఉండటాన్ని గుర్తించిన 2008–11 డిగ్రీ బ్యాచ్ మిత్రులందరూ రూ.లక్ష పోగేసి, మాజీ సర్పంచ్ బాలయ్య చేతుల మీదుగా.. ఆ కుటుంబానికి అందజేశారు. ఇక ముందు ఎలాంటి సాయం కావాలన్నా.. తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నారి చదువులకు అండగా నిలుస్తామన్నారు.


శివాలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పల్లకీ సేవ

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాడిబాయి శివాలయంలో ఆదివారం శివ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రీస్వామివారికి.. ఆలయం నుంచి ప్రధాన వీధులగుండా.. మహాదేవుని గుడికి ఊరేగింపుగా పల్లకీ సేవ నిర్వహించారు. అక్కడ పూజల అనంతరం శివాలయానికి చేరుకున్నారు. తరువాత శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శతనామావళి, శరణుఘోష, ధూప దీప నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. అనంతరం శివ భక్తులకు బిక్ష ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిట్టుస్వామి, గురుస్వామి గడ్డం చంద్రశేఖర్, శివస్వాములు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం



వీరాంజనేయస్వామి దేవాలయం

కుల్కచర్ల: మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్చనలు, పల్లకీసేవ, ప్రత్యేకపూజలు జరపనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆమె ప్రజల మనిషి

అనంతగిరి: జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ప్రజల మనిషి అని, అలాంటిది ఆమెపై అవిశ్వాసంపై పెట్టడం సరైంది కాదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సునీతమ్మను హ్యాట్రిక్ జెడ్పీ చైర్‌పర్సన్‌ను చేయాలని ప్రజలు నిర్ణయించుకుని, ఈ జెడ్పీటీసీలను గెలిపించారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎన్ని కుట్రలు పన్నినా.. ఏమీ కాదన్నారు. చైర్‌పర్సన్‌గా తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆశాభావం వ్యక్తంచేశారు.

పచ్చిమిర్చి పైపైకి

అనంతగిరి: పచ్చిమిర్చి ఘాటెక్కింది. వికారాబాద్ కూరగాయల మార్కెట్‌లో ఆదివారం ఏకంగా కిలో ధర రూ.80 పలికింది. దీంతో కిలో తీసుకునే వినియోగదారులు.. అరకిలోతో సరిపెట్టుకున్నారు. తాజాగా పొలాల్లోంచి తీసుకు వచ్చిన మిర్చికి డిమాండ్ ఉండటంతో.. రైతులు ఇదే అదనుగా భావించి, ధర పెంచుతూ విక్రియంచారు. తప్పనిసరి కావడంతో ప్రజలు కొనుగోలు చేయక తప్పలేదు.

అనుమతులు కొంత..
కొల్లగొట్టేది కొండంత

తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత

- ఇష్టారాజ్యంగా సహజ సంపద దోపిడీ
- మట్టి మాఫియాకు రాజకీయ నాయకుల అండ
- స్వచ్ఛంద సంస్థ ముసుగులో వసూళ్ల దందా
- చర్చనీయాంశమైన ఆడియో సంభాషణ



రంగంపల్లిలో అక్రమంగా మట్టి తోడిన ప్రాంతం

సహజ సంపద అక్రమార్కుల ధనదాహానికి ఆవిరైపోతోంది. అనుమతుల పేరిట రాత్రికి రాత్రే గుట్టలను సైతం మాయం చేస్తున్నారు. భారీ యంత్రాలతో మట్టిదిబ్బలను కూలదోస్తున్నారు. రాజకీయ పలుకుబడి, స్వచ్ఛంద సంస్థ నీడలో గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తూ.. కోటానుకోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారు.

పరిగి: నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. వీరికి అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకడంతో.. దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా పరుగులు పెడుతోంది. మైనింగ్ అధికారుల నుంచి అరకొర అనుమతులు తీసుకొని, గ్రామ శివారులోని గుట్టలను పిండి చేస్తున్నారు. ఇష్టంగా మట్టిని తోడుతూ.. యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ నాయకులు మైనింగ్ దందా చేయగా.. ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు, మేమేం తక్కువ కాదంటూ.. అదే బాటలో పయనిస్తుండటం చర్చనీయాశంగా మారింది.

చీకటి వ్యాపారానికి రాజకీయ రంగు!

చీకటి దందాపై ఇరు పార్టీల నాయకులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకున్నారు. వారి మధ్య పొడచూపిన పొరపొచ్చాలతో తాణా గడప తొక్కారు. దీంతో పోలీసులు పలు టిప్పర్లను పట్టుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టి వ్యాపారులకు అధికార పార్టీకి చెందిన వారే మూడు గ్రూపులుగా విడిపోయి, మద్దతు పలకడంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో.. క్రమంగా చీకటి కోణం బయటపడుతోంది. ఇదిలా ఉండగా.. స్వచ్ఛంద సంస్థ ముసుగులో కొందరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. రూ.50 వేలు ఇవ్వు.. అంతా మేం చూసుకుంటామన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఓ మట్టి వ్యాపారుడితో ఓ సంస్థ ప్రతినిధి మాట్లాడిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

గ్రామీణ ప్రాంత రోడ్లు ధ్వంసం

ఎర్రమట్టి, మట్టి ఉన్న అసైన్డ్, పట్టా భూములను గుర్తించిన వ్యాపారులు.. సదరు భూ యజమాని రైతుకు ఎంతోకొంత ముట్టజెప్పి మట్టిని తోడేస్తున్నారు. కొన్ని చోట్ల 10 ట్రిప్పుల అనుమతులు తీసుకొని, దానికి ఎన్నో రెట్ల ట్రిప్పులను తరలిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారు.



మట్టిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

మాఫియా ఇష్టారాజ్యం, అధికలోడు వెరసి గ్రామీణ ప్రాంత బీటీరోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. మండలం పరిధి రంగంపల్లి, రంగాపూర్, రాపోల్, జాఫర్‌పల్లి, ఇబ్రాహింపూర్, పూడూర్ మండలం పూడూర్, రాకంచర్ల, కుల్కచర్ల, దోమ తదితర గ్రామాల్లో మట్టి దందాకు అడ్డుకట్ట లేకుండా పోయింది.

'యాభై వేలు ఇవ్వు.. అన్నీ చూసుకుంటా'

స్వచ్ఛంద సంస్థ ముసుగులో వసూళ్ల దందా పెరిగింది. 'రూ.50 వేలు ఇవ్వు. నీ బండి ఎవరు ఆపుతారో చూస్తా.., పోనీ ముప్పై వేలు ఇవ్వు. ఎవరైనా నీ లారీ ఆపితే.. నీవు నా తమ్ముడవని చెప్పు. ఏం భయపడకు. అన్నీ చూసుకుంటా' అంటూ ఓ సంస్థ వ్యక్తి మట్టి వ్యాపారుడితో మాట్లాడిన ఆడియో ఫుటేజి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రస్తుతం అది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇలా ఇద్దరి మధ్య కొనసాగిన బేరం విడ్డూరంగా ఉందని, మట్టిమాఫియాతో వారు చేతులు కలపడమేంటని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. ఈ ఆడియో సంభాషణ మును ముందు ఎటు దారితీస్తుందో చూడాలి మరి.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహాయ సహకారాలతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని యాలాల సొసైటీ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీ మార్గంలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో ఈజీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలతో సీసీ పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. స్థానిక నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ నాయిూ, నాయకులు మోయిజ్, దూస శేఖర్, గంతల మైనొద్దీన్, శ్రీనివాస్, చిన్న, లాలు, వెంకటేశ్, నర్సింహులు, ఉమేష్, నవీన్, రాజు తదితరులు ఉన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ తదితరులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఉన్న సంక్షోభాన్ని ప్రభుత్వం నివారించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపితే.. సంక్షోభాన్ని నివారించవచ్చని సూచించారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలు (డీఏలు)మంజూరు చేయాలని, ప్రభుత్వ హామీ మేరకు సీపీఎస్ విధానం ఎత్తివేయాలని కోరారు. 317జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. సుప్రీ కోర్టు తీర్పు ప్రకారం సమగ్రశిక్ష, కేజీబీవీ, యూఆర్‌ఎస్, అన్ని వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఉపాధ్యాయులు, సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ రెగ్యులర్ చేయాలన్నారు. మెగా డీఎస్సీ వేసి, ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు.

భూ సమస్యలకు మోక్షం లభించేనా?

- ధరణి లోపాలను సవరించని వైనం
- ఇబ్బందుల్లో రైతులు..
- పట్టించుకోని యంత్రాంగం





భూ సమస్య పరిష్కారం కోసం నిరీక్షిస్తున్న రైతు కిష్టప్ప

దౌల్తాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు కిష్టప్ప. ఇతనిది మండల పరిధి గోకఫసల్వాద్ గ్రామం. ఈయనకు 94 సర్వే నంబరులో 1.0800ఎకరాల భూమి ఉంది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ధరణి ఏర్పాటు చేసిన తర్వాత వచ్చిన కొత్త పట్టా పాసుపుస్తకంలో ఎకరా భూమి నమోదు కాలేదు. దీంతో అధికారులను వివరణ కోరగా.. వేరియేషన్‌తో భూమి తక్కువగా నమోదు అయిందని తెలిపారు. అధికారులు ఈ ఎకరం భూమి అసైన్డ్ కింద హోల్డ్‌లో పెట్టారు. తన భూమి తన పట్టా పాసు పుస్తకంలో నమోదు చేయాలని సుమారు మూడేళ్ల నుంచి తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఇలా ఈ ఒక్క రైతు భూ సమస్య కాదు. మండలంలో చాలా మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. ధరణి లోపాలతో మండలంలోని అనేక మంది భూ సమస్య కారణంగా.. ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధిని పొందలేకపోతున్నారు. కొత్త రెవెన్యూ చట్టం అమలు కాకముందు పహాణిలో పట్టాదారు కాలంతో పాటు కబ్జాకాలం ఉండేది. ఎవరైనా భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటే పట్టా మార్పిడి జరగకపోయినా కబ్జా కాలంలో సంబంధిత రైతు పేరును నమోదు చేసేవారు. కొత్త రెవెన్యూ చట్టం అమలుతో కబ్జా కాలాన్ని ప్రభుత్వం తొలగించింది. క్షేత్రస్థాయిలో ఉన్న భూమిని సదరు రైతు కబ్జాలో ఉన్నా.. ఆ కాలం లేకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారులదే పైచేయిగా మారింది. కబ్జాకాలం తొలగింపుతో అనేక మంది రైతులు నష్టపోతున్నారు. పట్టాదారు ఒక్క పేరు రికార్డులో ఉండేసరికి వారు భూమిని విక్రయించినా, పట్టామార్పిడి జరగకపోవడంతో చిన్న సన్నకారు రైతులకు ముప్పు వాటిల్లేలా ఉంది. అనేక మంది చిన్న సన్నకారు రైతులు తమకు కొత్త పట్టాపాసు పుస్తకాలు చేతికి అందలేదని, అందుకు కారణం భూ వివరాలను ఆన్‌లైన్ చేయడంలో జరిగిన లోపాలే ప్రధాన కారణమంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ధరణిలో ఆప్షన్‌లు ఇవ్వకపోవడంతో అధికారులు కూడా చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వీటినంత త్వరగా భూమ స్యలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



దారూరు: శాలివాహన కాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

ధారూరు: మండల కేంద్రం శాలివాహన కాలనీలో ఆదివారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజచేసి ప్రారంభించారు. రూ.5 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన ఈ పనులను, వీరభద్రేశ్వర ఆలయం నుంచి శాలివాహన కాలనీ వరకు కొనసాగించనున్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, కల్వ కిరణ్‌కుమార్, ఎల్.అశోక్, అమరేశ్వర్‌రావు, బి.అంజయ్య, ఇబ్రహీం, రాము తదితరులు పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో..

కొడంగల్ రూరల్: మండల పరిధి హస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పీర్ల మజీద్ నుంచి లంగర్‌కుంట వరకు ఒక సీసీ, వైకుంఠధామం వెళ్లే దారిలో మరో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. రూ.50లక్షల నిధులతో ఈ పనులు కొనసాగుతున్నట్లు వారు తెలిపారు.



కొడంగల్ రూరల్: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులు

23న శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మండల పరిధి చెంగోల్ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరుగుతుందని, అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: ప్రముఖ దినపత్రికలో చౌడాపూర్ మండల విలేకరిగా పనిచేస్తున్న ఉదయ్ గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి.. తన అనుచరుల ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా టియుడబ్ల్యుజే–ఐజేయు జిల్లా కమిటీ రూ.5వేలను అందజేసింది. ఇందులో జిల్లా టియుడబ్ల్యుజె అధ్యక్షుడు శ్రీధర్, సంఘం నాయకులు రఘు, ప్రకాష్, వినోద్, కల్యాణ్, విజయ్, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి నేడు

కొడంగల్ రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 4గంటల నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూవాహిని శాఖ సభ్యులు తెలిపారు. మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు ప్రధాన రహదారి గుండా యాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఆలంపల్లిలోని హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమై.. ప్రధాన వీధుల గుండా బస్టాండ్ సమీపంలోని హనుమాన్ మందిరం వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



శివరామాంజనేయ స్వామి దేవాలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామంలో ఆదివారం శివరామాంజనేయ స్వామి దేవాలయంలో నాభిశిల, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ, గణపతి విగ్రహ ప్రతిష్ఠతతోపాటు, కుమారస్వామి, నందీశ్వరస్వామి, పోచమ్మ, శ్రీకృష్ణుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, ఎంపీటీసీలు సత్యనారాయణ రెడ్డి, రజిత, చంద్రశేఖర్, బాల్‌రాజ్, నర్సింలు, పాపయ్య, సురేందర్, శేఖర్, రాములు నాయక్, రాజు, రాములు, శ్రీను, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: ప్రజలు తమ ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె రామస్వామి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్–2లో ఆదివారం సోమాజీగూడకు చెందిన సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు, సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఏడాదికోసారి ప్రజలు తమ ఆరోగ్య రక్షణకు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ అధికారి డాక్టర్ నిహాల్ అమ్మాద్, డాక్టర్ మహ్మద్ మస్తాన్, సాయితేజ, రాజశ్రీ, అబూ సోఫియాన్, సందీప్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, సుగుణమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యులు, రోగులు తదితరులు

ఆశలు ఆ'వరి'



అడుగంటుతున్న బోరుబావులు

- నెర్రెలు బారుతున్న పొలాలు
- ఎండుతున్న పంటలు
- అన్నదాతల ఆవేదన

షాబాద్: వరి పంట పొలాలకు సరిపడా నీరు లేక నేలలు నెర్రలు బారుతున్నాయి. భూగర్భజలాలు ఇంకిపోవడం ఒక కారణమైతే, విద్యుత్ సరఫరాలో అంతరాయం మరో కారణం. అందులో భాగంగానే లోఓల్టేజీ సమస్యతో నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. లోఓల్టేజీతో వరి, మొక్కజొన్న పంటలు ఎండుముఖం పట్టాయి. పంటల కోసం రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి అప్పులే మిగిలేలా ఉన్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ బోరు బావుల్లో నీరు అడుగంటుతున్నాయి. ఎకరం పొలం తడవాలంటే 48 గంటల సమయం పడుతుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గతంలో ఎన్నడూ లేదు

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి రాలేదని, షాబాద్, కొమకబండ, బొబ్బిలిగామ, ఎర్రోనిగూడ, ఊబ్బగుంట తదితర గ్రామాల్లో పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మండలంలోనే కాదు. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది సరైన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో.. బోరు బావుల్లో తగినంత నీరు చేరలేదు.

బోరుబావుల పరిస్థితి దారుణం


జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పొలాలు అక్కడక్కడ నెర్రలు బారాయి. బోరు బావుల కింద వరి సాగు చేసే రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇదే పరిస్థితి కొనసాగితే వారం రోజుల్లో పొలాలను వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5.45 గంటల వరకు, విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అందులో కెపాసిటర్ బ్యాక్ లేకపోవడంతో లోఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పంట ఎండుతోంది




లోఓల్టేజీ సమస్యతో పంటలు ఎండుతున్నాయి. 2 ఎకరాలు వరి సాగు కోసం రూ.80 వేల అప్పులు చేశాను. కష్టపడి వరి సాగు చేస్తే లోఓల్టేజీ సమస్యతో వేసిన పంట ఎండుముఖం పడుతుంది. చేసిన కష్టం చేతికి రాకుండా పోతుందేమోనని బాధగా ఉంది. -చంద్రబాబు, రైతు, షాబాద్

పశువులకు మేతగా..



ఎకరం వరి పంటను సాగు చేశా. కళ్ల ముందే పంట ఎండిపోతుంటే ఏమీ చేయలేని పరిస్థితి దాపురించింది. బోరులో పుష్కలంగా నీరు ఉన్నా, అక్కడక్కడ కరెంట్ సరఫరాలో లోపం శాపంగా మారింది. రెండు స్టార్టర్లు, ఒక మోటారు కాలిపోయింది. -యాదిరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

పాలకులు స్పందించాలి



రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే లోఓల్టేజీతో కళ్ల ముందే ఎండిపోతున్నాయి. తడి లేక పొలాలు నెర్రలు చాస్తున్నాయి. -గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్